పాణ్యం, నందికొట్కూరు మార్కెట్ యార్డుల కమిటీ ఏర్పాటు

నంద్యాల ఎడ్యుకేషన్/ పాణ్యం/నందికొట్కూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పాణ్యం, నందికొట్కూరు మార్కెట్ యార్డులకు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పాణ్యం మార్కెట్ యార్డు చైర్పర్సన్‌గా అంగజాల గీత, నందికొట్కూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా వీరం ప్రసాద్‌రెడ్డిలను ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రెండు మార్కెట్ యార్డు కమిటీలకు డైరెక్టర్లను నియమిస్తూ ఎక్స్ అఫిషియో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

● **పాణ్యం మార్కెట్ యార్డు కమిటీ** : గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గౌరు చరిత, చైర్‌పర్సన్‌గా అంగజాల గీత, ఉపాధ్యక్షుడిగా యల్లంపల్లి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా లక్ష్మీప్రసన్న, ఉషారాణి, దుబ్బా వెంకటరమణారెడ్డి, ఈశ్వరమ్మ, ప్రభావతమ్మ, రాజు నాయక్, షణ్ముఖ రెడ్డి, సుధాకర్, పద్మలీల, జయమ్మ, రవికుమార్, ప్రభాకర్, మూల రామచంద్రారెడ్డితో పాటు గడివేముల పీఏసీఎస్ చైర్మన్, వ్యవసాయశాఖ ఏడీ నంద్యాల, పాణ్యం సర్పంచ్, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఉంటారు.

● **నందికొట్కూరు మార్కెట్‌యార్డు కమిటీ** : గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, చైర్మన్‌గా వీరంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్, సభ్యులుగా మహేశ్వరి, పెద్దదస్తగిరి, విజయలక్ష్మి, జీవన సుకన్య, మేకల రాములమ్మ, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మల్లీశ్వరి, ఛాయాలీల, సంపత్‌కుమార్, నిర్మల, రవితేజ, షేక్ రేష్మాపర్వీన్, షేక్ గాజుల మన్సూర్‌బాషాతో పాటు నందికొట్కూరు పీఏసీఎస్ అధ్యక్షులు, వ్యవసాయాధికారి, మున్సిపల్ చైర్మన్, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఉంటారు.



● స్టాఫ్‌నర్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జీడీఏ ఖాళీలు

● భర్తీ అయ్యేదెన్నడు?

● నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 142 పోస్టులు ఖాళీ

జీజీహెచ్‌లో సిబ్బంది కొరత

నంద్యాల హాస్పిటల్, మే 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సిబ్బంది తక్కువగా ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి స్థాయిని పెంచారేకానీ అందుకు తగినట్లు సిబ్బందిని పెంచకపోవడంతో అవస్థలు పడుతున్నారు. 2022లో ప్రభుత్వ ఆస్పత్రి జీజీహెచ్‌గా స్థాయిని పెంచారు. అప్పట్లో ఉన్న ఆస్పత్రికి తగిన సిబ్బంది ఉన్నారు. అయితే ప్రస్తుతం స్థాయికి తగ్గట్లుగా సిబ్బంది లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. జీజీహెచ్ ప్రస్తుతం 450 పడకలుగా స్థాయి ఉంది. దీన్ని త్వరలో 650 పడకలకు పెంచేందుకు అధికారులు సమాయత్తం అయ్యారు. అయితే స్థాయికి తగ్గట్టుగా సిబ్బందిని కూడా పెంచాలనే ఆలోచన లేకపోవడం విశేషం. అంతేకాకుండా నంద్యాల జిల్లా అయినప్పటికీ ఆస్పత్రిలో సిబ్బంది నియామకం మాత్రం కర్నూలు జీజీహెచ్‌నుంచే కొనసాగుతుంది. ఆస్పత్రిలో 484 పోస్టులు మంజూరుకాగా ఇందులో 342మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఓపీడీ విభాగం



జీజీహెచ్‌లో ఎక్కువశాతం ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు

పోస్టుపేరు	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న సిబ్బంది	ఖాళీలు
స్టాఫ్‌నర్స్‌లు	200	161	39
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు	35	10	25
జూనియర్ అసిస్టెంట్/ కంప్యూటర్ అసిస్టెంట్	23	05	18
జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ)	75	46	29
ఆఫీస్ సబార్డినేట్	17	09	08
మెడికల్ రికార్డు ఆఫీసర్	01	--	01

● జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ బేసిస్ కింద 304 పోస్టులు మంజూరుకాగా 204మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఔట్‌సోర్స్ కింద 133 పోస్టులు మంజూరుకాగా 73మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో రెగ్యులర్ డాక్టర్లు ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. పోస్టుల నియామకాలు చేపట్టాలంటే కొన్ని జిల్లా పరిధిలో ఉండగా మరికొన్నిటికి పై అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. జీజీహెచ్‌లో వేలసంఖ్యలో ప్రజలు ఆస్పత్రికి వస్తున్నప్పటికీ సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ముఖ్యంగా ఆస్పత్రిలో జీడీఏల సేవలు ఎంతో అవసరం. అయినప్పటికీ జీడీఏల నియామకం జరగకపోవడంతో రోగుల బంధువులు స్వయంగా పేషెంట్లను వార్డులకు, పరీక్షల కోసం తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

సిబ్బంది అవసరం ఉంది



జీజీహెచ్‌లో సిబ్బంది అవసరం ఉంది. గత నెల మొదటి కౌన్సెలింగ్‌లో జీడీఏ, జూనియర్ అసిస్టెంట్లు, కౌన్సిలర్లు కలిపి 50 మంది వచ్చారు. రెండో కౌన్సెలింగ్‌లో పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. త్వరలోనే పోస్టులు భర్తీ అవుతాయి.

-డాక్టర్ మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్, నంద్యాల

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చే దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులు మంజూరుచేసేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రోత్సాహకాలకు సంబంధించి పెట్టుబడి సబ్సిడీ కింద 11 క్లెయిమ్స్‌కు రూ.1.5కోట్లు, పవర్ టారిఫ్ కింద 10 క్లెయిమ్స్‌కు రూ.16.48 లక్షలు, వడ్డీ సబ్సిడీ కింద 14 క్లెయిమ్స్‌కు రూ.79.54 లక్షలు మొత్తంగా 37 క్లెయిమ్స్‌కు రూ.2.11 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మకు సంబంధించి 66దరఖాస్తుల లోటుపాట్లను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, ఎల్డీఎం రవీందర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్‌ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్, ప్రైవేట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు భారీ వర్షాలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో నేడు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో చెదురుమొదురు వర్షాలతో పాటు అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. భారీ వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందున హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న గోడలు, చెట్ల కింద నిలబడకూడదన్నారు. పిడుగులతో కూడిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కాలువలు, నదులను పర్యవేక్షించాలి

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న సమాచారం మేరకు జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు ఉన్నప్పుడు జిల్లా యంత్రాంగం అవగాహనతో ఉండాలన్నారు. ఈదురు గాలులు, వీస్తున్నప్పుడు స్తంభాల, చెట్ల కింద ఉండొద్దన్నారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులు, కాలువలు, నదులను జిల్లాలోని పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలి

● 17 గ్రామాల్లో చురుకుగా రీసర్వే

● నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్

● అల్ట్రాటెక్ భూముల పరిశీలన



భూ రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో చల్లా విశ్వనాథ్

కొలిమిగుండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పనుల్లో ఎలాంటి తప్పులు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన తనిఖీచేసి మాట్లాడారు. నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో 17 గ్రామాల్లో భూ రీసర్వే పనులు చురుగ్గా కొనసాగుతున్నట్లు తెలిపారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, రీసర్వే చేసిన భూముల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 13గ్రామాల్లో భూరీసర్వే పనులు విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. రీసర్వే పనులపై రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించరాదని హెచ్చరించారు. అల్ట్రాటెక్ భూములను ఆయన తహసీల్దార్ ఈశ్వరరెడ్డితో పరిశీలించారు. పెట్నికోట సమీపంలో అల్ట్రాటెక్ పరిశ్రమ మరో నూతన ప్లాంట్ నిర్మాణపనులను ఇటీవల ప్రారంభించింది. దీనికి సంబంధించిన భూములను ఆర్డీవో పరిశీలించి, రెవెన్యూ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ విశ్వతేజ, మండల సర్వేయర్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

నంద్యాల హాస్పిటల్, మే 21 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓలు) పేర్కొన్నారు. రెండేళ్లనుంచి సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ అన్నారు. నంద్యాలలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 24వ రోజుకు చేరింది. సమస్యల పరిష్కారం కొరకు సమ్మెబాట పట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులు సీహెచ్‌ఓల డిమాండ్లు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో ఆరేళ్లనుంచి సీహెచ్‌వోలుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఇటీవల ప్రోత్సాహకాలు ఆరునెలల బకాయిలు విడుదల చేయడంపై ముఖ్యమంత్రికి, ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వేతన సవరణ, ప్రావిడెంట్‌ఫండ్ తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సౌందర్య, భాస్కర్, సురేష్‌బాబు, గురుప్రసాద్, హారిక, అఖిల్, చక్రధర్, భార్గవ్‌తో పాటు జిల్లాలోని సీహెచ్‌వోలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

యోగాతో ఒత్తిడిని జయించొచ్చు

● అందరి జీవితాల్లో యోగా భాగం కావాలి

● కలెక్టర్ రాజకుమారి గనియా

● ఇండోర్ స్టేడియంలో యోగా మాసోత్సవం ప్రారంభం

నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని జయించొచ్చు అని కలెక్టర్ రాజకుమారి గనియా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా మాసోత్సవ ప్రారంభ వేడుకలో ఆమెతో పాటు జేసీ విష్ణుచరణ్ పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితాల్లో యోగా భాగం కావాలని అన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సాధన చేసేవారు తప్పనిసరిగా యోగా చేయడంతో విజయాలు సాధించవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ఆయూష్, వైద్య, ఆరోగ్య, పంచాయతీ, పురపాలక, సిబ్బంది సహాయ సహకారాలు అందస్తారన్నారు. ప్రతివార్డు నుంచి ఇద్దరికి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో 24 పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, దేవాలయాల వద్ద, వెయ్యి మందితో యోగా చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆయూష్ జిల్లా అధికారి యశోధర, డీఈవో జనార్దన్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పది సప్లిమెంటరీ పరీక్షలకు 474 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 35 పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 474 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బుధవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా 1,085 మంది విద్యార్థులకు గాను 611 మంది హాజరుకాగా 474 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఓపన్ పరీక్షలో భాగంగా 4 పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ లాంగ్వేజి(తెలుగు, ఉర్దూ) పరీక్ష నిర్వహించగా 127 మంది విద్యార్థులకు గాను 106 మంది విద్యార్థులు హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్లు వివరించారు. అదేవిధంగా ఇంటర్ పరీక్షల్లో భాగంగా రెండు కేంద్రాల్లో రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్ష నిర్వహించగా 150 మంది విద్యార్థులకు గాను 136 మంది విద్యార్థులు హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కొలిక్కి వచ్చిన చర్చలు

● పొగాకు రైతుల సమస్య పరిష్కారం

● జూన్ 10లోపు మొత్తం కొంటామని కంపెనీలు హామీ

● నేటి నుంచే కొనుగోళ్లు ప్రారంభం



పొగాకు కంపెనీల ప్రతినిధులు, రైతులతో చర్చిస్తున్న డీఏవో మురళీకృష్ణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల ఎడ్యుకేషన్/ నూనెపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీల మాయా జాలంతో రైతులు మరోసారి నష్టపోయారని, ఈ ఏడాది పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని 'కొనేవారేరీ.?' అనే కథనానికి అధికా రులు స్పందించారు. ఈ కథనంతో కలెక్టర్ రాజకుమారి గనియా కంపెనీల ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు దిగివ చ్చారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ చొరవతో రెండు దఫాలుగా రైతులతో, రైతుసంఘాల నాయకులతో, పొగాకు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. బుధవారం సాయంత్రం వరకు జరిగిన చర్చలు కొలిక్కివచ్చాయి. జిల్లాలో తాము హామీపత్రం ఇచ్చిన పొగాకు అంతటిని జూన్ 10వ తేదీలోపు కొనుగోలు చేస్తామని, నేటి నుంచే కొనుగోళ్లు రైతులకు దగ్గరలోని మండల కేంద్రాల్లో ప్రారంభిస్తామని, ధర కూడా నాణ్యతను బట్టి రూ.12,500 తక్కువ కాకుండా రూ.18,000 వరకు కొనుగోలు చేస్తామని కంపెనీల ప్రతినిధులు డీఏవోకు హామీనిచ్చారు. దీంతో రైతులు, రైతుసంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులకు అండగా ఉంటారని ఆశిస్తున్నాం



పొగాకు రైతుల బాధను కళ్లారా చూసిన కలెక్టర్ రాజకుమారి తక్షణమే స్పందించారు. పొగాకు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడడం, డీఏవో మురళీకృష్ణ చూపిన చొరవతో సమస్య పరిష్కారమైనందుకు వారిద్దరికీ కృతజ్ఞతలు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆశిస్తున్నాం.

- రాజశేఖర్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సంతోషంగా ఉంది..



తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే కంపెనీలతో చర్చలు జరపడం సంతోషంగా ఉంది. రెండున్నర ఎకరాల్లో పొగాకు వేశా. కంపెనీలు స్పందించకపోవడంతో పొగాకు ఇండ్లలో పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం.

- సుబ్బారెడ్డి, పొగాకు రైతు, పాములపాడు

వెంటనే కొనుగోలు చేసేలా..



జిల్లాలో వివిధ కంపెనీలతో అగ్రిమెంట్ అయిన పొగాకు నిల్వలు చాలా ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే కంపెనీ ప్రతినిధులపై తక్షణ చర్యలకు ఉపక్రమించడంతో వారు చర్చలకు వచ్చారు. జూన్ 10వ తేదీలోపు పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేలా పర్యవేక్షిస్తాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

చౌక దుకాణాల నుంచి రేషన్

● ఎండీయూ వాహనాల వ్యవస్థ రద్దు ● జూన్ 1 నుంచి అమలు

నంద్యాల నూనెపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్ కార్డుదారులకు రేషన్ పంపిణీ విధానాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంగళవారం జరిగిన ఏపీ కేబినెట్ మీట్‌లో నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకులు పక్కదారి పడుతుండటంతో ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ఐదేళ్ల హయాంలో చౌకదుకాణాల వ్యవస్థను పక్కనబెట్టి ఇంటింటికీ రేషన్ పేరుతో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ)ను రంగంలోకి దింపింది. రేషన్ డీలర్ల పొట్టకొట్టి తమ పార్టీ కార్యకర్తలకు ఎండీయూ వాహనాలను కట్టబెట్టింది. ఇంటింటికీ రేషన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తిపలుకుతూ పాతపద్ధతినే కొనసాగించనుంది.



ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకుంటున్న ప్రజలు (ఫైల్)

జూన్ 1నుంచి అమలు



జిల్లాలో 5,34,234 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. 1204 చౌకదుకాణాల నుంచి ఎండీయూ వాహనాల ఆపరేటర్లు రేషన్‌ను తీసుకొని వాహనాల ద్వారా పంపిణీ చేసేవారు. ఎండీయూ వ్యవస్థను రద్దుచేసి ఆహార భద్రతా చట్టం మార్గదర్శకాలను చౌక దుకాణాల వద్దే సరుకులు ఇచ్చేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1నుంచి రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, తదితర పదార్థాలను లబ్ధిదారులు తీసుకోనున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు డోర్ డెలివరీ చేయనున్నారు.

రూ.24.57 కోట్లు వృథా

జిల్లాలో 351ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఒక్కొక్క వాహనాన్ని రూ.7లక్షల చొప్పున కొనుగోలు చేశారు. అందులో కొంత ఆపరేటర్ వాటా కాగా మిగిలింది బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. ప్రతినెలా ఒక్కో ఆపరేటర్‌కు రూ.20వేల చొప్పున వేతనం చెల్లించారు. వాహనాలకు రూ.24.57 కోట్లు వెచ్చించారు. ఇంటింటికీ రేషన్ అనే పేరేగాని వీధుల్లో, వీధి చివరలో ఎక్కడబడితే అక్కడ ఎండీయూ వాహనాలు నిలిపి లబ్ధిదారులకు సరుకులు అందించారు. ప్రతి ఇంటికీ వాహనాలు వెళ్లిన దాఖలాలు ఎక్కడా లేవు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు 95శాతం రేషన్ సరుకులు పంపిణీ చేయగా, ఎండీయూ వ్యవస్థ వచ్చాక అది 80శాతానికి పడిపోయింది. జిల్లాలో ప్రతినెలా సుమారు 30వేల నుంచి 50వేల వరకు కార్డుదారులకు సరుకులు అందడం లేదు. వైసీపీ కార్యకర్తలైన ఎండీయూ ఆపరేటర్లు ఇష్టారీతిన వ్యవహరించడంతోపాటు ప్రతినెలా 1నుంచి 17వ తేదీవరకే సరుకులు ఇచ్చేవారు. దీంతో చాలామందికి సరుకులు అందకుండా పోయాయి.



నల్లమలలో జీవ వైవిధ్యం



- ప్రపంచీకరణతో వెంటాడుతున్న ముప్పు
- అంతరించిపోయిన పలు జీవులు
- నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినం

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): నల్లమల జీవ వైవిధ్యానికి మారుపేరు. నల్లమల జీవవైవిధ్య సమతౌల్యాన్ని సజావుగా సాగిస్తూ జీవుల మనుగడకు తోడ్పాటునందిస్తోంది. ప్రత్యేకించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిబింబంగా నిలిచే పెద్దపులుల ఆవాసానికి కీలకమైన నల్లమల అడవులు ప్రకృతి నిధులుగా, సహజ సంపదలుగా వేల సంవత్సరాల నుంచి ఎంతో విశిష్టతను సంతరించుకున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన నల్లమలలో ప్రస్తుతం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రపంచీకరణ వల్ల జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది. పలు జీవుల ఉనికే కనుమరుగైపోయింది. ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యం దెబ్బతింటున్న సందర్భంలో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి సకల జీవుల సంరక్షణకు తోడ్పాటు నందించాలన్న సంకల్పంతోనే ప్రతిఏటా మే 22వ తేదిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి పిలుపు ఇచ్చింది.



నల్లమలలో సుమారు 1500 రకాల వృక్షజాతులు, 200 రకాల పక్షిజాతులు, 80రకాల గడ్డిజాతులు, 350 రకాల ఔషదమొక్కలు, 55 రకాల మత్స్యసంపద, 80రకాల సరీసృపాలు, 20 రకాల ఉభయ చరజీవులకు నల్లమల అడవులు ఆవాసాన్ని కల్పిస్తున్నాయి.

ప్రత్యేకించి పర్యావరణ సూచికలో త్రికోణ అగ్రభాగాన నిలిచిన పెద్ద పులి ఆవాసానికి సైతం నల్లమల అనుకూలంగా వుంది. ఎంతో సున్నితమైన జీవనం సాగించే పులుల ఎక్కడైతే ఆవాసాన్ని ఏర్పర్చుకుంటాయో ఆ ప్రాంతం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయని చెప్పవచ్చు. వాస్తవానికి జాతీయ అటవీ విధానం ప్రకారం భూవిస్తీర్ణంలో 33శాతం అడవులు ఉండాల్సి వుండగా ప్రపంచవ్యాప్తంగా 31శాతం అటవీ విస్తీర్ణం వుండగా మన దేశంలో మాత్రం కేవలం 23శాతం మాత్రమే అడవులు విస్తరించి ఉన్నాయి. అయితే మన ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం 21శాతం మాత్రమే అడవుల విస్తీర్ణం వున్నట్లు తెలుస్తోంది. అంటే జిల్లా వ్యాప్తంగా 17,658 చ.కి.మీల విస్తీర్ణం వుండగా అందులో 3482.65చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు విస్తరించాయి.

ఈ పరిస్థితి వల్ల నల్లమలలో అనేక జీవ జాతులు అంతరించి పోతున్నాయి. ప్రత్యేకించి రాబందుల సంచారం నల్లమలలో కనుమరుగైంది. అలాగే పిచ్చుక జాతులు ఉనికే లేకుండా పోయింది నల్లమలలో ఒకప్పుడు విస్తారంగా ఉండే జిట్రేగి, బంక చెట్లు నేడు కనుమరుగయ్యాయి. పలు నీటి కుంటలు, సరస్సుల్లో గుర్రపుడెక్క అల్లుకుపోవడం వల్ల జలచరాల జీవనానికి ఇబ్బందిగా మారుతున్నట్లు తెలుస్తోంది.

సుస్థిరమైన అభివృద్ధి కోసం అటవీశాఖ కసరత్తు :

సుస్థిరమైన జీవ వైవిధ్యాన్ని అభివృద్ధి పరిచేందుకు అటవీశాఖ ఎంతగానే కసరత్తు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకించి జీవవైవిధ్య సంరక్షణలో భాగంగా జీవజాతులకు అవసరమయ్యే ఆహారం, ఆవాసం, తాగునీటిని సమకూర్చేందుకు అటవీశాఖ చొరవ తీసుకుంటున్నది. వీటితో పాటు అడవుల పరిరక్షణ, అభివృద్ధి, రక్షణ అనే అంశాలను పరిగణలోకి తీసుకుని అటవీశాఖ ముందుకెళ్తోంది. ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో వున్న నల్లమల అడవుల్లో 3727.82 చ.కిమీలో నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం విస్తరించింది. ఇందులో పెద్దపులి ఆవాసానికి అనువైన ప్రాంతమైన కోర్ఏరియా 1250.46 చకిమీలు కాగా, గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యంలోని కోర్- ప్రాంతం 1193.68 చకిమీలు ఉంది.

జీవవైవిధ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి



అడవుల సంరక్షణలో ప్రజలు భాగమైనప్పుడే జీవవైవిధ్యాన్ని పరిరక్షించే అవకాశం వుంటుంది. జీవవైవిధ్య సంరక్షణకై అటవీశాఖ అనేక విధాలుగా కృషి చేస్తున్నది. దీనికి అనేక ప్రచార సాధనాల ద్వారా చర్యలు తీసుకుంటున్నది.

- సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

జీవవైవిధ్య సంరక్షణలో ఆదివాసుల పాత్ర

వందల ఏళ్ల నుంచే అడవి తల్లికి ఆదివాసులే అండగా నిలుస్తున్నారు. అటవీశాఖ ఆవిర్భావానికి మునుపే అటవీరక్షణలో చెంచులు రాణిస్తున్నారు. వృక్షసందపను కొల్లకొట్టే స్మగ్లర్లను, వన్యప్రాణులను వేటాడే వేటగాళ్లపై అనేక సందర్భాల్లో ఎదిరించి అటవీ రక్షణలో భాగస్వాములై జీవవైవిధ్య సంరక్షణకు పాటుపడుతున్నారు. అయితే ప్రస్తుతం అటవీరక్షణలో చెంచులకు అటవీశాఖ సరైన ప్రాముఖ్యత కల్పించడం లేదు.

పుష్కరిణికి రూ.2.80 కోట్ల విరాళం

- స్థపతితో నిర్మాణ పనుల పరిశీలన
- త్వరలో అందుబాటులోకి పుష్కరిణి



మంత్రాలయంలో కొనసాగతున్న పుష్కరిణి పనులు

మంత్రాలయం, మే 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటక లోని ఉడిపి చెందిన ప్రకాష్ శెట్టి అనే భక్తుడు రూ.2.80 కోట్లు పుష్కరిణి పనులకు విరాళంగా ఇచ్చారు. బృందావన్ గార్డెన్, సర్వజ్ఞ మందిరం స్థలంలో పుష్కరిణి పనులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. 160 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు, 7.5 అడుగుల లోతుతో పుష్కరిణి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు సురేష్ కోనపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి, స్థపతి తిరుమల స్తంభి, ప్రముఖ చిత్రకారుడు నటరాజన్ గణేష్ తో పుష్కరిణి పనులు పరిశీలించారు. త్వరలో పుష్కరిణి పనులు పూర్తి చేసి తుంగభద్ర నది నుంచి పుష్కరిణిలో నీటిని నింపి భక్తులకు అందు బాటులోకి తీసుకురానున్నారు. పూజలు చేసేందుకు అనుకూలంగా మెట్లు, రూపకల్పన, సరిహద్దులు, ప్రహరీ కంచను ఏర్పాట చేయాలని పీఠాధి పతి అధికారులను ఆదేశించారు. ఈ పుష్కరిణి నిర్మాణానికి విరాళం ఇచ్చి న దాత ప్రకాష్శెట్టిని పీఠాధిపతి అభినందించారు. కార్యక్రమంలో మఠం ఏఈ బద్రినాథ్, శ్రీహరి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి, శ్రీహరి కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనివాసులు, సూపర్వైజర్ హనుమంతు పాల్గొన్నారు.

ప్రతి వారం మండలాలకు వెళ్లండి

- ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలి
- 16 ప్రభుత్వ అంశాల మీద ప్రజాభిప్రాయం సేకరించాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారులు ప్రతి వారం మండలాలకు వెళ్లాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలన్నారు. గత రెండు నెలల్లో ఎన్ని రోజులు మండలాలకు వెళ్లారు? తాగునీటి సమస్య ఉందా? పారిశుధ్యం ఎలా ఉంది? ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయన్న అన్న అంశాలపై ఆరా తీశారు. ఎక్కడైనా సమస్యలు గుర్తించారా అని మండల స్పెషల్ అధికారులను ప్రశ్నిం చారు. ప్రతినెలా 16 ప్రభుత్వ అంశాల అమలు మీద ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతోందని, ప్రజాభిప్రాయం వ్యతిరేకత వ్యక్త మైతే వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ అధికా రులను ఆదేశించారు.

పెంఛన్ పంపిణీకి హాజరు కావాలి

ప్రతి నెలా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి వారం మండల స్పెషల్ అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ జడ్పీ సీఈవోను ఆదేశించారు. మండల స్పెషల్ అధికారిగా ఉన్నప్పటికీ రెండు నెలల నుంచి తనకు కేటా యిం చిన నందవరం మండలానికి వెళ్లి మండల పురోగతిపై సమీక్ష నిర్వహించలేదని నందవరం మండల స్పెషల్ అధికారి, పరిశ్రమల శాఖ ఇన్చార్జి జీఎంను సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు, వీసీ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్నాయక్ పాల్గొన్నారు.





కర్నూలు నగరంలోని హంద్రీనదిలో ప్రవహిస్తున్న వరద నీరు



సుంకేసుల బ్యారేజీని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి

సుంకేసులకు వరద

- ఎన్నో ఏళ్ల తర్వాత మే నెలలో తుంగభద్రకు వరద
- హంద్రీలో వరద ప్రవాహం
- జిల్లాలో విస్తారంగా వర్షాలు

కర్నూలు, మే 21 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు ముందుగానే పలకరించాయి. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కర్ణాటకలో సైతం భారీవర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు ఉపనది అయిన వేదవతి పొంగిపొర్లుతుంది. ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పోటెత్తింది. బుధవారం కేంద్ర జలసంఘం (సీడబ్లూసీ), జలవనరుల శాఖ గేజింగ్ రికార్డుల ప్రకారం కోసిగి మండలం మేలగనూరు వద్ద తుంగభద్రలో 20వేల క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. మంత్రాలయం వద్ద 20,140 క్యూసెక్కుల వరద ప్రవహిస్తుంది. సుంకేసుల బ్యారేజీకి 17,916 క్యూసెక్కులు వరద ఉంది. దాదాపు పదేళ్ల తర్వాత మే నెలలో తుంగభద్రకు వరద రావడం ఇదే ప్రథమం. జిల్లాలో ప్రవహించే హంద్రీ నదికి వరద చేరడంతో కర్నూలు నగరం రాజ్విహార్లో వరద నీటి ప్రవాహం తో నగర వాసులను కనువిందు చేస్తుంది. దాదాపు పదేళ్ల తర్వాత హంద్రీకి మే నెలలో వరద రావడం ప్రథమమని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. సుంకేసుల బ్యారేజీని ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే సుంకేసుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.



ఓ... మేఘమాల

ప్రకృతి పారవశ్యానికే కాదు... పద బంధాల అల్లికలోనూ, భూమి, ఆకాశాల అందాలలోనూ పెనవేసుకుంటాయి. నింగీ నేలా కలిసిపోయినట్లు అనిపించేలా ఉన్న నీలి మేఘమాల అద్భుత దృశ్యం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గుట్టపై బుధ వారం సాయంత్రం కనిపించింది. ఆకాశంలో కారు మబ్బులు సమూహాలై దట్టంగా చేరి కర్నూలును చుట్టుముట్టేశాయా? అన్నట్లు కనిపిస్తున్న ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- కర్నూలు(ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు



మార్గదర్శకులు

ఓర్వకల్లు, మే 21 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి బంగారు కుటుంబానికి ఓర్వకల్లు పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం బాటలు వేసింది. పొదుపులక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఐదు మార్గదర్శి బంగారు కుటుంబాల దత్తత తీసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన కోసం 'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంపన్న కుటుంబాలు అనగారిన వారికి మధ్య ప్రత్యక్ష సం బంధాన్ని సృష్టించడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సేవా మనస్తత్వంతో ఉన్న సంపన్న కుటుంబాలు పేద కుటుంబాలను దత్తత తీసుకోవడమే ప్రధాన లక్ష్యం.

- మేమున్నామంటున్న పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం
- ఐదు 'మార్గదర్శి బంగారు కుటుంబాల' దత్తత
- పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి
- పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయం

ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి..

'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమంలో తమ సహకారం అందించేందుకు ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం ముందుకొచ్చింది. ఆ సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. నన్నూరు గ్రామానికి చెందిన మౌలాబీకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు 17ఏళ్ల వయసులో ఫిట్స్రోగానికి చనిపోయాడు. భర్త గుండె బ్యాధితో, కుమార్తె ఫిట్స్తో బాధపడుతుంది. ఆమెకు నెలకు రూ.2వేలు వరకు మందులు ఖర్చు అవుతాయని, వాటిని కొనే స్థోమత లేదని కమిటీ సభ్యులకు వివరించారు. ఆ కుటుంబానికి మండల ఐక్యసంఘం నెలకు రూ.2వేల చొప్పున జీవితాంతం మందుల ఖర్చు భరిస్తామని, రూ.24వేల చెక్కును అందజేశారు.



మార్గదర్శి బంగారు కుటుంబ సభ్యులతో విజయభారతి

బాలభారతి స్కూల్లో ఆయా పోస్టు

హుశేనాపురం గ్రామానికి చెందిన నుసుదుబి భర్తకు క్యాన్సర్ రాగా నలుగురు పిల్లలతో రోడ్డున పడ్డారు. గుర్తించిన మండల సమాఖ్య దత్తత తీసుకుని ఇద్దరు పిల్లలకు పదోతరగతి వరకు ఉచితంగా విద్య అంది స్తామని, ఆమెకు బాలభారతి స్కూల్లో ఆయా పోస్టు కల్పించారు.

చదివించే బాధ్యత..

ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన చెట్లమల్లాపురం లక్ష్మిదేవి కొడుకు హత్యకు గురికాగా, కోడలు జైలులో ఉంది. తల్లి దండ్రులు లేక ముగ్గురు పిల్లలు అనాథలు మారి నాయనమ్మ వద్ద ఉంటున్నారు. వారికి రూ.50 వేల చెక్కును అందజేశారు. అలాగే చదివించే బాధ్యతను తీసుకున్నారు.

నన్నూరు మౌలాబీ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న విజయభారతి



వైద్యం ఖర్చుల కోసం నెలకు రూ.3వేలు

హుశేనాపురం చెందిన భాగ్యలక్ష్మి భర్త అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. భాగ్యలక్ష్మి కూడా అనారోగ్యం బారిన పడింది. వైద్యం చేయించుకోవడానికి, పిల్లలను చదివించేందుకు ఇబ్బందులు పడుతుండేది. మండల సమాఖ్య ఇద్దరు పిల్లలకు ఇంజనీరింగ్ పూర్తయ్యేదాకా చదివిస్తామని, ఆమెకు నెలకు రూ.3వేలు వైద్యం కోసం ఇస్తామని చెక్కును అందజేశారు. అలాగే చింతలపల్లె గ్రామానికి చెందిన వృద్ధురాలి భర్త, కొడుకు చనిపోవడంతో ఆమె అనా రోగ్యంతో బాధపడుతూ తిండిలేని స్థితిలో ఉంది. ఆమెకు మందుల ఖర్చులు అందజేస్తామన్నారు. పొదుపులక్ష్మి మహిళల స్ఫూర్తి ప్రశంసనీయమని బంగారు కుటుంబ సభ్యులు కొనియాడారు.

రుణపడి ఉంటా..



నా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ముందుకు వచ్చిన పొదుపులక్ష్మి సంఘానికి రుణపడి ఉంటా. రోడ్డున పడిన మా కుటుం బాన్ని ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

నుసుదుబి, హుశేనాపురం

నా జీవితానికి భరోసా



నా జీవితానికి మండల సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో మార్గదర్శి బంగారు కుటుంబం ప్రవేశ పెట్టడం పేదల జీవితాల్లో వెలుగు నింపడమే.

మౌలాబీ, నన్నూరు

సీఎం చంద్రబాబే మాకు స్ఫూర్తి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే మాకు స్ఫూర్తి. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అత్యంత ఐదు నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని వారిలో చీకటి నుంచి బయటకు తీసుకురావాలని ముం దుకు వెళ్తున్నాం. రాబోయే సంవత్సరంలో 1000 మంది కుటుంబాలను దత్తత తీసుకోవాలని లక్ష్యం పెట్టుకున్నాం.

- విజయభారతి, పొదుపు లక్ష్మి మండల సమాఖ్య గౌరవసలహాదారు

కర్నూలు 7వ అదనపు జిల్లా న్యాయాధికారిగా లక్ష్మీరాజ్యం

కర్నూలు లీగల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణ జిల్లా నందిగామలో సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీ రాజ్యంను కర్నూలు 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారిగా పదోన్నతి కల్పించి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమె కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారిగా, వక్ఫ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. ఇంత వరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న జి. భూపాల్ రెడ్డి గత నెలలో బదిలీ కావడంతో ఏర్పడిన ఖాళీని రాష్ట్ర ప్రభుత్వం ఈమె నియామకంతో పూర్తి చేసింది. ఈమె బాధ్యతలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలలో పేర్కొంది.

డిగ్రీ సెమిస్టర్‌లో ఐదుగురి డిబార్

కర్నూలు అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 26 పరీక్షా కేంద్రాల్లో 7,498 మంది దరఖాస్తు చేసుకోగా 6,769 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు. రాఘూస్ డిగ్రీ కాలేజీ, ఎమ్మిగనూరు-1, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోసిగి-2, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ, కర్నూలు-1, శ్రీసాయి డిగ్రీ కాలేజీ, డోన్-1 విద్యార్థులు పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేశామని ఆయన తెలిపారు.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

ఎమ్మిగనూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణం, పరిసర ప్రాంతాలలో బైకుల చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. 16 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ శ్రీనివాసులు వివరాలు తెలిపారు. 16 బైకుల దొంగతనంలో ఉప్పరి వీరేష్, వర్ధన్, అబ్దుల్ కలాం నిందితులని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణ శివార్లలో గల ఉప్పర కొట్టాల కాలనీ దగ్గర మంత్రాలయం రోడ్డులో దాగి ఉన్న నిందితుడు ఉప్పరి వీరేష్ (26)ను బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి విచారించినట్లు తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో చోరీ చేసిన బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు అబ్దుల్ కలాం గతంలో నమోదైన మరో కేసులో ప్రస్తుతం జైలులో ఉన్నట్లు తెలిపారు. మరో నిందితుడు ఇక్బాల్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. 16 బైకుల మొత్తం విలువ రూ 15,60,000 అని తెలిపారు. అరెస్ట్ అయిన వీరేష్‌ని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై మధుసూదన్ రావు ఉన్నారు.


బైకులు, నిందితుతో పోలీసులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి, బైక్‌పై నుంచి పడి మహిళ..

కర్నూలు క్రైం/ బనగానపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నందికొట్కూరు రహదారిలో భూపాల్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పింజారి సిద్దయ్య(59) అనే వ్యక్తి మృతిచెందాడు. నందికొట్కూరుకు చెందిన పింజారి సిద్దయ్య తన మిత్రుడు సయ్యద్‌తో కలిసి మోటారు సైకిల్‌పై కర్నూలు బయల్దేరాడు. వీరిద్దరూ వృత్తి రీత్యా లారీ డ్రైవర్లు. ఆత్మకూరు చెందిన ఆర్టీసీ డిపో బస్సు ఆత్మకూరు వైపు వెళ్తూ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో సిద్దయ్య కాలు తెగి పక్కనపడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా కోలు కోలేక కొద్దిసేపటికే మరణించాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బనగానపల్లె మండలం పలుకూరుకి చెందిన బోయ మహాలక్ష్మీ(20) రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందింది. పలుకూరు నుంచి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైకు నుంచి జారి కిందపడింది. తలకు తీవ్రమైన గాయం కావటంతో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్

మద్దికెర, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామ శివారు వద్ద హంద్రీనీవా కాలువలోకి టిప్పర్ దూసుకెళ్లింది. వివరాల మేరకు.. డ్రైవర్ పత్తికొండ నుంచి వస్తూ పనులు చేస్తున్నాడు. బుధవారం వస్తుండగా మట్టి వదులుగా ఉండటంతో టిప్పర్ అదుపు తప్పింది. డ్రైవర్ రాముడుకు గాయాలై కాలు విరిగింది. అతడిని 108లో గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు.


కాలువలో పడిన టిప్పర్

మంత్రాలయంలో పది లారీలు సీజ్

మంత్రాలయం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం స్టీల్ ఫ్యాక్టరీకి వస్తున్న రికార్డులు లేని లారీలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చి వెళ్లే లారీలను, రికార్డులు, ఇతరత్రా వస్తువులు సరఫరా అవుతున్నాయన్న సమాచారంతో పోలీసులు లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను రోడ్డుపైనే సీజ్ చేశారు. రికార్డులు సక్రమంగా కలిగిన ఉన్న వాహనాలను వదిలేశారు. మరికొన్నింటికి అపరాధ రుసుం విధించారు. అదేవిధంగా పరిమితికి మించి లోడుతో వెళ్తున్న వాహనాలను కూడా పోలీసులు పరిశీలించారు. ఆదోని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సైతం దాడులు చేసి రెండు లారీలు మాధవరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రోజు వందలాది లారీలు రికార్డులు, పర్మిట్లు లేకుండానే రాకపోకలు సాగిస్తున్నాయని ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో దాడులు నిర్వహించి పది లారీలు సీజ్ చేసినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

సీఐపై దాడి కేసులో నిందితులకు జైలు

కర్నూలు లీగల్, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారు పేటలో ప్రభుత్వ భూమి కబ్జాలను తొలగించేటప్పుడు బందోబస్తు విధులు నిర్వహిస్తున్న అప్పటి సీఐ పార్థసారధి రెడ్డిపై దాడి చేసి గాయపరిచిన ఏడుగురు నిందితులకు ఒక్కొక్కరికి 5 సంవత్సరాల కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు సెషన్స్ జడ్జి దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక రెండో పట్టణ పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీటు మేరకు 2021 నవంబరు 30న బంగారు పేటలోని కేసీ కెనాల్‌కు ఆనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కట్టడాలను తొలగించడానికి బందోబస్తుగా అప్పటి టూ టౌన్ సీఐ పార్థసారధి రెడ్డి, అప్పటి కోడుమూరు సీఐ శ్రీధర్ సిబ్బందితో అక్కడకు వెళ్లారు. అయితే.. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తుండగా.. కొంత మంది రాళ్లతో పోలీసులపై దాడి చేయడంతో సీఐ పార్థసారథిరెడ్డికి గాయలయ్యాయి. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు స్థానిక బంగారు పేటకు చెందిన డి.లక్ష్మి, నీలిశికారి బెల్కి, ఎన్. నరసింహులు, నీలిశికారి సుగుణ, ప్రసాద్, నీలిశికారి నాగముని, నీలిశికారి బెహినిలపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడుగురు నిందితులకు ఐదు సంవత్సరాల కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయదికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున బాల రంగస్వామి వాదించారు.

లాభాలపాలు

- కేజీ పాలు రూ.60 నుంచి రూ.200
- ఔషధ తయారీల్లో వినియోగం
- బొప్పాయి పాలతో రైతులకు ఊరట
- ఉత్తర భారతదేశంలో బొప్పాయి కాయలకు తగ్గిన గిరాకీ
- పాల సేకరణ వైపు మొగ్గు
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాపారులు


చెట్టు నుంచి పాలను సేకరిస్తున్న కూలీ


చిన్నవంగలిలో సాగు చేసిన బొప్పాయి తోట


బొప్పాయి పాలు

చాగలమర్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి పాలు రైతులకు, వ్యాపారులకు లాభాల బాట పట్టిస్తున్నాయి. ఈపాలకు యమ డిమాండ్ ఉంది. బొప్పాయి పంటలో వైరస్ ఎక్కువ. సీజనల్ ఇబ్బందుల వల్ల పంట దిగుబడిలో అంచనాలు తారుమారు అవుతాయి. ఒక్కోసారి బొప్పాయి కాయల ధర, డిమాండ్ స్థిరంగా ఉండదు. బొప్పాయి పాలకు పెరుగుతున్న ప్రాధాన్యత వల్ల రైతులు ఊరట చెందుతున్నారు.

పాల సేకరణ ఇలా..

బొప్పాయి పాల సేకరణకు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రంలోని కొయ్యంబత్తూరు, కడప జిల్లాలోని రైల్వేకోడూరుకు చెందిన కొందరు వ్యాపారులు చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించి వైరస్ సోకి పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి పంటను ఎకరాకు రూ.6 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటకు రూ.10వేలు చెల్లించి పాలను సేకరిస్తున్నారు. కేజీ పాలను రూ.60నుంచి రూ.200 వరకు కొంటున్నారు. ఈపాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారని వారు చెబుతున్నారు. బొప్పాయి కాయలకు బ్లేడ్‌తో మూడు చోట్ల గాట్లు వేస్తారు. పాలు కారే సమయంలో చెట్ల కింద ప్లాస్టిక్ ప్లేట్లు ఏర్పాటు చేస్తారు. ఇలా సేకరించిన పాలు ముద్దగా మారిపోతాయి. వాటిపై నీళ్లు చల్లి ప్లేట్లలో ఉన్న పాలను డ్రమ్ముల్లోకి మార్చి ఎగుమతి చేస్తారు. పాలు కారాక బొప్పాయి కాయలు పనికి రాకుండా పోతాయి. రైతులు బొప్పాయి చెట్లను తొలగిస్తారు. దెబ్బతిన్న బొప్పాయి తోటల్లో పాల సేకరణతో రైతులకు ఉపశమనం కలుగుతుంది.

రోజుకు 50 నుంచి 70 కేజీలు..

బొప్పాయి పండ్లు ఎగుమతి చేసే ఏజెంట్ సురేష్ మాట్లాడుతూ బొప్పాయి పాలకు గిరాకీ ఉండటంతో తోటలను కొనుగోలు చేసి పాలు సేకరిస్తున్నామన్నారు. 10 మంది కూలీలు రోజుకు 50 నుంచి 70 కేజీల బొప్పాయి పాలను సేకరిస్తారు. కూలీలకు రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు కూలీ ఇస్తున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఎకరా బొప్పాయి పంట నుంచి 75 కేజీల పాలు, పూర్తిగా దెబ్బతిన్న పంట నుంచి 50 కేజీల పాలు వస్తాయి.

ఆదుకుంటున్న పాల సేకరణ

బొప్పాయి పండ్లు, పాలు పలురకాల వ్యాధులకు ఔషధంగా పని చేస్తాయని వైద్యులు చెబుతారు. డెంగీ, ఇతర వ్యాధుల బారిన పడిన వారు బొప్పాయి పండు విరివిగా తినాలని సూచిస్తున్నారు. బొప్పాయి ఆకు రసం కూడా సేవించవచ్చని కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం బొప్పాయికి వైరస్ సోకడంతో దిగుబడి తగ్గింది. ఉత్తర భారతదేశంలో గిరాకీ అనుకున్నంత లేకపోవడంతో ఎగుమతులు తగ్గాయి. దీంతో టన్ను ధర రూ.20వేలు నుంచి రూ.5వేలకు పడిపోయింది. ఈ పరిస్థితుల్లో బొప్పాయి పాల సేకరణ రైతులను ఆదుకుంటోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో బొప్పాయి సాగు చేసి నష్టపోయిన రైతులకు బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.



బొప్పాయి పాలు సేకరిస్తున్నాం

ప్రతి రోజు ఒక ఎకర పంటలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 కేజీల పాలను సేకరిస్తాం. కేజీ పాలకు రూ.20 ఇస్తున్నారు. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. బొప్పాయి పాల సేకరణ ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి జీవిస్తున్నాం.

- రాశి, మహిళా కూలీ, రైల్వే కోడూరు



బొప్పాయి పాలతో ఊరట..

ప్రకృతి వైపరీత్యాలతో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది. గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాం. పాల సేకరణకు తోటలు అమ్ముకుంటాం. బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.

- గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి గ్రామం

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- హౌసింగ్ పీడీ చిరంజీవి


మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి

తుగ్గలి, మే 21 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు.

బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణం కోసం దరఖాస్తులను తనిఖీ చేసి, అర్హులైన లబ్ధిదారుల గృహాలను మాత్రమే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ సచివాలయ పరిధిలో దరఖాస్తులను పరిశీలించి, అవీన సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్ చేసి బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విశ్వమోహన్, హౌసింగ్ డీఈ విజయ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరానికి తరలిరండి: బొజ్జా


సంతజూటూరులో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

బండిఆత్మకూరు మే21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతాంగం జీవనాడి సిద్ధేశ్వరం అలుగు సాధనకై ఈ నెల 31వ తేదీన చేపట్టిన చలో సిద్ధేశ్వరం కార్యక్రమానికి రైతులంతా తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామి రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సంతజూటూరు గ్రామంలో రైతులతో ఆయన మాట్లాడుతూ గత పాలకులంతా రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు. రాయలసీమకు సాగునీరు అందించలేని పాలకులు వివిధ ప్రాజెక్టు నిర్మాణాలు బూచిగా చూపి దగా చేస్తున్నారని అన్నారు. రాయలసీమ రైతుల గొంతుక అసెంబ్లీకి వినిపించాలని, ప్రభుత్వం సిద్ధేశ్వరం నిర్మించేలా చలో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. నాగసుధాకర్, పక్కీర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడటం అందరి విధి

- విజిబుల్ పోలీసింగ్‌లో 94 మందిపై కేసు నమోదు : ఎస్పీ


వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం జిల్లాలో విబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా 94 మద్యం తాగిన కేసులు నమోదు చేశామని, 95 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణ, జరగ కుండా ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్కా, జూదం జిల్లాలో ఎక్కడ జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు.

అవినీతి అధికారుల్లో దడ



- మరిన్ని శాఖలపై ఏసీబీ నిఘా
- 'రెవెన్యూ'లో పైసలిస్తే పనులు అనే ఆరోపణ
- పోలీసు శాఖలోనూ ఇదే తంతు..
- ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న చైతన్యం
- లంచం అడిగితే ఫిర్యాదు
- మార్పుతోనే అవినీతి అంతం: సోమన్న, డీఎస్పీ, ఏసీబీ

ఆళ్ళగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారుల్లో దడ మొదలైంది. మరిన్ని శాఖలపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. ఇటీవలే పట్టణంలో విద్యుత్ శాఖ ఏడీఈ రవికాంత్ చౌదరి ఏసీబీ అధికారులకు చిక్కారు. అతడి వద్ద ఉన్న కేజీల కొద్ది బంగారు ఆభరణాలు, స్థిర, చరాస్థులపై దాడులు కొనసాగిస్తున్నారు. కింది స్థాయి అధికారుల వద్ద పనులు కాకపోతే ప్రజలు ఉన్నత స్థాయి అధికారుల వద్దకు తమ సమస్యలు విన్నవించేందుకు వస్తున్నారు. వారు కూడా లంచాలు అడుగుతుండటంతో చేసేదీ లేక ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రజల్లో కూడా చాలా మార్పు వచ్చింది. ఎవరు లంచం అడిగినా వెంటనే ఏసీబీకి సమాచారం ఇస్తున్నారు.

విద్యుత్ శాఖలోనే

ఆళ్లగడ్డ మండలం చిన్న కంబలూరులో విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి, సిబ్బంది ప్రతాప్ రూ.40 వేలు లంచం తీసు కుంటూ ఇటీవలే పట్టుబడ్డారు. విద్యుత్ శాఖలోనే మరికొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరు సంపాదించుకుంది చాలని అతిగా వ్యవహరిస్తే ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని మెల్లగా ఆయా కార్యాలయాల నుంచి ఇతర ప్రాంతాలకు జారుకొన్నట్లు సమాచారం.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పంచాయతీ రాజ్ శాఖలపై కూడా ఏసీబీ అధికారులు నిఘా వేసినట్లు ప్రచారం కొనసాగుతోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పైసలిస్తే తప్ప పనులు జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు శాఖలో కూడా అక్కడక్కడ కొంతమంది లంచావతారులు ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఆళ్లగడ్డ ఎస్ఐ హరిప్రసాద్ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ వద్ద రూ 20 వేలు లంచం డిమాండ్ చేయడంతో ట్రాక్టర్ డ్రైవర్ రూ.10 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఇంకా పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ట్రాక్టర్ డ్రైవర్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అవినీతి అధికారులు ఇటీవల కాలంలో దాడులు ముమ్మరం చేయడంతో పాటు ఉన్నతాధికారులను సైతం కటకటాలపాలు చేస్తుండడంతో ప్రజలకు కొండంత ధైర్యం వస్తుంది.

ఎక్కడ అవినీతి జరిగినా ఫిర్యాదు చేయండి



అవినీతి ఎక్కడ జరిగినా ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. ప్రజల్లో మార్పు వస్తే అవినీతి కూడా అంతరించిపోతుంది.

- సోమన్న, డీఎస్పీ, ఏసీబీ

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి


డీపీఎంకు వినతిపత్రం ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నంద్యాల ఎడ్యుకేషన్, మే 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో డీపీఎం నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రమేష్‌బాబు, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 12 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే నిరాహారదీక్షకు సిద్ధమని హెచ్చరించారు. మహిళా కార్మికులకు పనిగంటల విధానం అమలు చేయాలని, వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.

నీలకంఠేశ్వరుడి కౌలు ఆదాయం రూ.12.27 లక్షలు


వేలంలో పాల్గొన్న అధికారులు

నంద్యాల రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో వెలిసిన నీలకంఠేశ్వర కోదండస్వామి దేవస్థానానికి చెందిన భూములకు నిర్వహించిన కౌలువేలంతో రూ12.27 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. బుధవారం దేవాలయంలో 51ఎకరాల భూములకు వేలం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాల పరిమితితో పదిమంది రైతులు వేలంలో సాగు హక్కులు దక్కించుకున్నారన్నారు. ఇందులో భాగంగానే గతంలో నిర్వహించిన వేలం కంటే ప్రస్తుతం రూ. మూడు లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లు వివరించారు. నంద్యాల గ్రామీణ సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ గంగయ్య బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు బైరెడ్డి శంకరమ్మ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవోలు, పర్యవేక్షణ అధికారులుగా పాల్గొన్నారు.

24న ఆలయ భూములకు వేలం: నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలోని రామస్వామి దేవస్థానానికి చెందిన భూములకు ఈనెల 24న కౌలు వేలాలు నిర్వహించనున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. రామస్వామి దేవస్థానానికి చెందిన 24.45 ఎకరాలకు బహిరంగ కౌలు వేలాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు దేవదాయశాఖ నిబంధన ప్రకారం డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. సంవత్సరం కాలపరిమితితో భూములను సాగు కోసం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు.

అర్హులైన విద్యార్థుల జాబితా విడుదల

నంద్యాల ఎడ్యుకేషన్, మే 21(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల లిస్టు ఆయా పాఠశాలల్లో నోటీస్ బోర్డులో పెట్టామని జిల్లా కన్వీనర్ డాక్టర్ ఇష్రాత్‌బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఇష్రాత్‌బేగం మాట్లాడుతూ జిల్లాలోని 20 ఆదర్శ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులను రోస్టర్ కమ్ విధానంలో సెలక్ట్ చేశామన్నారు. జేసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ అప్రూవల్ అనంతరం 20 పాఠశాలల్లో అర్హుల జాబితాను నోటీసు బోర్డులో అతికించామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు వెళ్లి జాబితాను పరిశీలించుకోవాలన్నారు.

దొంగలు వస్తున్నారు జాగ్రత్త

బండిఆత్మకూరు మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సరికొత్త రూపాల్లో దొంగలు వస్తున్నారని, కొత్త వారిని ఎవరినీ నమ్మవద్దని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని శింగవరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు బలికావొద్దని, చిన్న పిల్లలకు మోటార్‌బైక్‌లు ఇవ్వొద్దని, జూదాల జోలికెళ్లొద్దని అన్నారు. భూతగదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

జూపాడుబంగ్లాలో వర్షం

జూపాడుబంగ్లా, మే 21 (ఆంధ్రజ్యోతి): జూపాడు బంగ్లాతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. సాయంత్రం 3గంటల నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వేపచెట్టుపై పడిన పిడుగు

పాములపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామ శివార్లలోని పంట పొలాల్లో భారీ శబ్దంతో పిడుగు పడింది. సమీపంలోని పొలాలలో పని చేస్తున్న కూలీలు ఆ శబ్దాలకు పరుగులు తీశారు. పిడుగుపాటుకు సమీపంలోని వేపచెట్టు పై భాగం నుంచి కింది వరకు ఒకవైపు నల్లగా మారింది. పిడుగుపాటుకు సమీపంలోని ఎనిమిది కరెంటు స్తంభాలకు సంబంధించిన ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. దాంతో పాములపాడులో దాదాపు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేశారు.

మూతపడుతున్న విలేజి హెల్త్ క్లినిక్‌లు


బలపనూరులో మూతపడిన ఆరోగ్య ఉప కేంద్రం


పాండురంగాపురంలో మూతపడిన విలేజి హెల్త్ క్లినిక్

నంద్యాల హాస్పిటల్, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న విలేజి హెల్త్ క్లినిక్‌లు మూతపడుతున్నాయి. ఈ ఆస్పత్రుల్లో సేవలందించాల్సిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమ్మెబాట పట్టడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయం చూపాల్సిన జిల్లా వైద్యాధికారి పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం ప్రజలకు అందని పరిస్థితి నెలకొంది. బుధవారం జిల్లాలో పలు విజిలే క్లినిక్‌లు మూతపడ్డాయి. పాణ్యం మండలంలోని బలపనూరు, నంద్యాల మండలంలోని పాండురంగాపురం, పుసులూరు, గడివేమల మండంలోని గడిగరేవుల, కొర్రపోలూరు విలేజి హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా అటువైపు వెళ్లకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఆస్పత్రి ఉంటుందని చికిత్స కోసం వెళ్లి నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ముగిసిన కుంభాభిషేకం

కలశ స్థాపనలో పాల్గొన్న గౌరు దంపతులు

పాణ్యం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కుంభాభిషేక మహోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు హాజరయ్యారు. వేదపండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పీటపూజ, రాజగోపుర కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి అష్టోత్తర కలశ మహా కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని కలశ ప్రతిష్ఠకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండపం కాళ్లగురువు ప్రతిష్టాచార్య ఆగమిక పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ, గణపతిశర్మ శిష్య బృందం పాల్గొన్నారు.

అతిథి గృహానికి భూమిపూజ : కొత్తూరులో దాతల విరాళాలు రూ. 10 లక్షలతో నిర్మించతలపెట్టిన అతిథిగృహానికి ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి భూమిపూజ నిర్వహించారు. అనంతరం వారు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు నారాయణ శర్మ, సురేష్‌శర్మ పాల్గొన్నారు.


కలశాల స్థాపనలో పాల్గొన్న గౌరు దంపతులు

అలుగు నిర్మించండి

నందికొట్కూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టడం ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రత్నం అన్నారు. ఈనెల 31న కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేట్టాలని కోరుతూ ప్రజా బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహులు, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రత్నం ఏసేపులు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ వెనుకబాటు తనానికి వివక్షతకు పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే రాయలసీమ లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి మజీద్ మియా, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ప్రజాస్వామ్య పరరక్షణ ఐక్య వేదిక నాయకులు జయరాం, కార్మిక సమాఖ్య నంద్యాల డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి

ఆత్మకూరురూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలిసిన అభయాంజనేయ స్వామి దేవస్థానంలో, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తజన సందోహం నడుమ గురువారం వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ కమిటీల నిర్వాహకులు బి.వి. నాగరాజు, మారం మురళీకృష్ణ తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ప్రాతఃకాల సమయం నుంచే అభిషేకాలు, అర్చనలు తదితర పూజాక్రతువులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో శోభాయాత్ర ను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపారు.

శ్రీశైలం: శ్రీశైలంలోని పాతాళగంగ మార్గంలో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

పాతపద్ధతే కొనసాగించాలి

వెలుగోడు, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో కొనసాగుతున్న క్లస్టరు విధానంతో జనాభా ప్రాతిపదికను రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టరుగా చేసే ఆలోచనకు ప్రభుత్వం స్వస్తి పలికి పాత విధానాన్నే కొనసాగించాలని వెలుగోడు మండల వీఆర్వోలు కోరారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. పాత విధానాన్నే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ కొత్త బస్టాండ్ శాఖ వారి ఆధ్వర్యంలో బైపాస్ సర్కిల్‌లో నూతన ఆటో స్టాండ్‌ను ఏర్పాటుచేసి ఏఐటీయూసీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన రఘురాంమూర్తి, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టీసీ తర్వాత అతిపెద్ద రవాణా రంగమైన ఆటో రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమగా గుర్తించాలన్నారు. నాయకులు నాగేంద్ర, మాలిక్, నాగేశ్వర రావు, నాగరాజు, శేషాద్రి గౌడ్, ప్రవీణ్, శ్యామ్ రాజ్, ఏసన్న, రాజు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యున్నతికి పాటుపడతా

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తానని రెండువార్డు కౌన్సిలర్, వైసీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ కార్యదర్శి మారుబోతుల విజయకుమార్ అన్నారు. బుధవారం తనకు రాష్ట్రస్థాయిలో పదవి కేటాయించడంపై ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి మాజీ సీఎం జగన్, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేలా పనిచేస్తానని అన్నారు. వైసీపీ నాయకులు పువ్వాడి భాస్కర్, పాణ్యం పార్వతీ, రాజగోపాల్, నాగరాజు, సురేష్, లాలు, కలిముల్లా, ముర్తుజా పాల్గొన్నారు.

షరతులను తొలగించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల మంజూరు, తొలగింపు, మార్పులు తదితర ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం విధించిన షరతులను ఎత్తివేయాలని అన్నారు. అలాగే సర్వర్ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ సెంటర్ల వద్దే పడికాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. కొత్తగా పెళ్లయిన వారికి వివాహ సర్టిఫికేట్ అడగడం వల్ల ఇబ్బందులు ఎదురవున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇబ్బందులు లేకుండా రేషన్ కార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేంద్ర, వీరన్న, ఇస్మాయిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో అపరిశుభ్రత


పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పెరిగిన పిచ్చి మొక్కలు

జూపాడుబంగ్లా, మే 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యకారణాలతో వచ్చే రోగులకు ఆహ్లాదం కల్పించేలా ఉండాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అపరిశుభ్రత నెలకొంది. పారుమంచాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం 24 గంటల వైద్యశాలగా పేరుంది. గదులన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన సౌకర్యాలున్న వైద్యశాలను నిర్మించారు. అయితే ఆవరణంతా చిట్టడివిని తలపిస్తోంది. పాములకు నిలయంగా మారడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. లోపల చూస్తే సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను తలపిస్తే, ఆవరణం మాత్రం ఇదీ వైద్య శాలేనాంటూ రోగులు, పలువురు విస్తుపోతున్నారు. అపరిశుభ్రతను తొలగించి ఆరోగ్యవాతావరణం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి మౌనికను వివరణ కోరగా అపరిశుభ్రంగా ఉందని ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, ఉపాధి కూలీలతో తొలగిస్తామని చెప్పారు, కానీ ఇంతవరకు ఎవరురాలేదని చెప్పారు.

భూములను అప్పగిస్తే ఉద్యమిస్తాం

అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్

నందికొట్కూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సైపాలెం గ్రామానికి చెందిన భూములను గ్రీన్‌కో కంపెనీకి అప్పగిస్తే ఉద్యమిస్తామని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నాలుగువేల ఎకరాల భూములను కంపెనీకి అప్పగిస్తే జీవాలకు మేత లేకుండా పోతుందన్నారు. చెరువుకు హంద్రీనీవా కాల్వ నుంచి నీళ్లతో నింపితే దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇలాంటి పనులను ప్రభుత్వం విస్మరించి కార్పొరేట్ ప్రయోజనాలను కోరుకుంటూ భూములను ధారదత్తం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మిడ్తూరు మండలంలోని అలగనూరు రిజర్వాయర్ కట్ట కుంగిపోయి ఐదేళ్లు అయినా మరమ్మతు చేయడం లేదన్నారు. ఈ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో గడివేముల మండలంలో 40వేల ఎకరాలు బీడు భూములుగా మారాయన్నారు. వెంటనే కట్ట మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత ఐక్యరైతు సంఘం జిల్లా అధ్యక్షులు అర్లప్ప, సోమన్న, రమేష్, నరసయ్య, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్

బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు బాక్సింగ్ క్రీడల జిల్లా లీగల్ అడ్వయిజర్ అలిహుసేన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని కేవీకే స్టేడియంలో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుంజయ్, మంజునాథ్, సిద్ధార్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, అలితో పాటు బాలికల విభాగంలో అర్చన ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పీల్ మున్నా, వాలీబాల్ కోచ్ కృష్ణ పాల్గొన్నారు.

శ్రీశైలంలో సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలం(ఆత్మకూరు), మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై బుధవారం కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్నీ నిర్వహించారు. నిత్య కళారాధనలో భాగంగా ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సాక్షి గణపతికి పూజలు: శ్రీశైల క్షేత్ర పరిధిలోని సాక్షిగణపతి స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ప్రతి బుధవారం, సంకటహర చవితి, పౌర్ణమి రోజుల్లో స్వామి వారికి సర్కారీసేవను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పంచామృతాలు, ఫలోదకాలతో పాటు హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకించారు.

జ్వాలా వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు : శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పార్చన గావించి నివేదన కార్యక్రమాలు చేపట్టారు.

బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు చెక్ అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహానంది ఆలయ పరిధిలోని నాగనంది సదనం 12 గదులు కూల్చివేత పనుల్లో పాల్గొని ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో మృతి చెందిన ఇద్దరు కూలీల కుటుంబాలకు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చెక్‌ల రూపంలో ఆర్థిక సాయం అందజేసారు. బుధవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో మృతులు తాటిపర్తి వెంకటేశ్వర్లు, గుత్తి వెంకటరాముడుల కుటుంబ సభ్యులకు దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ప్రకారం రెండు లక్షల చెక్‌లను అందజేశారు.

మసీదులకు నూతన కమిటీల ఎన్నిక


నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల గాంధీచౌక్, లతీఫియా మసీదులకు నూతన కమిటీలను బుధవారం ఎన్నిక నిర్వహించారు. నంద్యాల చౌక్ మస్జీద్ అధ్యక్షులుగా మనియార్ అర్షద్ అహ్మద్, కార్యదర్శిగా డీఎస్ జాఫర్, లతీఫియా మసీదు అధ్యక్షులుగా డీఎస్ జాహెద్ హుస్సేన్, కార్యదర్శిగా ఎస్ఐ అడ్వకేట్ ఖలీల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నియామక పత్రాలను కమిటీ సభ్యులకు అందజేశారు. నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి


బండిఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు మే21(ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీలలో జరిగే టీడీపీ మహానాడును జయప్రదం చేయాలని కెసీ కెనాల్ ఛైర్మన్ రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బండి ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో మహానాడు విజయవంత సన్నాహక సమావేశం మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 20 గ్రామాలు, నాలుగు మజరా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నా రు. తెలుగుగంగ ప్రాజెక్టు వైస్‌ఛైర్మన్ మనోహర చౌదరి, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు భరద్వాజశర్మ, యూనిట్ ఇన్‌చార్జి బుగ్గరాముడు, ఉపాధ్యక్షుడు చలమయ్య పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిరావాలి..

వెలుగోడు: నంద్యాలలోని మార్కెట్‌యార్డ్‌లో గురువారం నిర్వహించనున్న మినీ మహానాడుకు టీడీపీ నాయకులు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ వెలుగోడు పట్టణ అధ్యక్షుడు మొమిన్‌రసూల్, ప్రధాన కార్యదర్శి వీరభద్రుడు అన్నారు. వెలుగోడు మండలం నుంచి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు వెళ్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి బాప్టిస్టు చర్చి 150 ఏళ్ల వేడుకలు

ఆత్మకూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో గల బాప్టిస్టు చర్చి 150 ఏళ్ల వేడుకలను ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి బాలరాజు బుధవారం తెలిపారు. 1875 మేలో చర్చి నిర్మించినట్లు చెప్పారు. 150 ఏళ్లను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా హైదరాబాద్ నుంచి రెవరెండ్ సజీవరాజు, కేజే విజయకుమార్, బొంత సామేల్, జీవన్‌రావు, అనీల్ కుమార్, ప్రకాశరావుతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బాప్టిస్టు పెద్దలు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

కొలిమిగుండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో కలిసి జిల్లా నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘనాయకులు బాబాఫక్రుద్దీన్, నాగన్న, రైతులు కామిని ప్రతాపరెడ్డి, శ్రీకాంతరెడ్డి, పుల్లయ్య, పెద్దయ్య కల్వటాల, కొలిమిగుండ్ల రైతులు పాల్గొన్నారు.

దారిలా.. నడిచేదెలా?



చాగలమర్రిలో నీటి కుంటగా రహదారి

చాగలమర్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికే వాగులా మారుతోంది. దీనికి ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది. బుధవారం తెల్లవారుజామున కురి సిన వర్షానికి రహదారిలో నీరు నిలిచి కుంటలా మారింది. ఆ నీటిలో నుంచే వాహనదారులు, పిల్లలు, పెద్దలు, మహిళలు నడవాల్సి వస్తోంది. వర్షపు నీటిలో రాకపోకలు సాగించేందుకు ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి, నాయకులు మల్లెంపల్లె జనార్దన్, రాజశేఖర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్యాపిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పల్లి గ్రామంలో బుధవారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో నెలరోజులుగా నీరు సరఫరా కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలి

శిరివెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి) : ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై రోస్టర్ కం మెరిట్ విధానంలో సెలక్ట్ అయిన విద్యార్థులు ఆయా ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలని జిల్లా కన్వీనర్ ఇష్రత్ బేగం బుధవారం సూచించారు. జిల్లాలోని 20 ఆదర్శ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆయా పాఠశాలల వద్ద పొందుపరిచినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ జాబితా ప్రకారం తమ విద్యార్థులను త్వరితగతిన ఆదర్శ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

30న ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

శిరివెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో 30న ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 28న గణపతి పూజ, నవగ్రహ, వాస్తు ప్రధాన కలశ స్థాపన, 29న మహాస్నపనము, రుద్రాభిషేకం, చండీ హోమం, ధాన్యాధివాసం నిర్వహిస్తామన్నారు. 30న యంత్ర, విగ్రహ, కలశ స్థాపన, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

డోన్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులు పొదుపుగా ఉపయోగించుకోవాలని డోన్ కమిషనర్ ప్రసాద్‌గౌడు బుధవారం అన్నారు. రెండు, మూడు రోజుల నుంచి ఈదురు గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతిని సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. దీని వల్ల డోన్ పట్టణానికి నీటి సరఫరాలో జాప్యం జరుగుతుందని ప్రజలు గమనించాలన్నారు. విద్యుత్ అంతరాయం విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

డోన్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 22వ తేదీతో ముగుస్తుందన్నారు. ఇంటర్ ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాధుర్యం ఏది..?

- సహజత్వాన్ని కోల్పోతున్న మామిడిపండ్లు
- రసాయనాలతో మాగబెడుతున్న వ్యాపారులు
- రోగాల బారిన పడుతున్న వినియోగదారులు



కొలిమిగుండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : పసుపు పచ్చని రంగులో నిగనిగలాడే మామిడి ఫలాలను చూస్తే చిన్నారి నుంచి వృద్ధుల వరకు లొట్టలేస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. బనగానపల్లె ప్రాంతంలో లభించే బంగినపల్లి మామిడికి ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ, విదేశీ ప్రముఖుల మనసు సైతం మన మామిడి దోచేసింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మధుర ఫలాలు నేడు తమ సహజత్వాన్ని కోల్పోయి నాణ్యతలేమిగా మారుతున్నాయి. మామిడి పండ్ల వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పలు రకాల కెమికల్స్‌తో విషతుల్యంగా మారుస్తున్నారు. మార్కెట్లో మామిడి వ్యాపారులపై అధికారుల నిఘా ఏమాత్రం లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా రసాయనాలతో మాగించి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రధాన రకాలైన బేనిషా, రెడ్డిప సంద్, మల్‌గుబా, దిల్‌పసంద్ తదితర రకాలు పూర్తిగా నాణ్యతలేనివి దొరుకు తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. సహజంగా మాగిన మామిడి పండ్లు మార్కెట్లో ఎక్కాడా దొరికే పరిస్థితే లేదని పలువురు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తుండటం గమనార్హం.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రమాదకర రసాయనాలతో పండ్లు మాగించడం నేరం. ఇప్పటికే వ్యాపారులకు అవగాహన కల్పించాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు చేపడతాం. బనగానపల్లె ప్రాంతంలో మామిడి శాంపుల్స్ సేకరించి, ల్యాబ్‌కు పంపించాం.

- షేక్ ఖాశీంవలి, ఫుడ్ సేఫ్టీ అధికారి

తగ్గుతున్న దిగుబడులు

మరోవైపు ఏయేటికాయేడు మామిడి పండ్ల దిగుబడులు పెద్ద ఎత్తున తగ్గిపోతున్నాయి. దీంతో మంచి రకాలైన మామిడి పండ్లు విపరీ తంగా ధరలు పెరిగి, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. ఒకప్పుడు మే నెల మామిడి సీజన్ లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యాపారం సాగేది. ప్రస్తుతం చాలా వరకు వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లా లో సుమారు 70వేల ఎకరా ల్లో మామిడి సాగవుతుండగా, ప్రస్తుతం కేవ లం 12వేల ఎకరాలకే పరిమితమవడం గమనార్హం. ముఖ్యంగా బనగానపల్లె ప్రాంతంలో మామిడి సాగుకు సరైన ప్రోత్సాహం లేక పెద్దఎత్తున సాగు తగ్గిపోయిందని పలువురు వాపోతున్నారు. దీంతో మంచి రకాలైన మామిడి కొనుగోలు చేయాలంటే కేజీ రూ.120 నుంచి రూ.250వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సామాన్యులు నాణ్యతలేని మామిడి ఫలాలవైపే చూస్తున్నారు.

దుష్ప్రచారం తగదు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ మే 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ మహానాడులో తాను ఒకటైతే దాన్ని మరోలా కొన్ని పత్రికలు, చానళ్లు దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేనేదో పార్టీ అధిష్ఠానాన్ని, చంద్రబాబును, లోకేష్‌ను ఉద్దేశించి మాట్లాడినట్లు వక్రీకరిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసిన వారికి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకొని వెళ్లామన్నామన్నారు. ఎన్ని అవాస్తవాలు రాసినా ప్రజలు ఎప్పుడు మా వైపే ఉన్నారన్నారు.

వైరస్ వచ్చిన చికెన్ అమ్మితే ఉరుకోవాలా:

వైరస్ వచ్చిన చికెన్ అమ్మితే ఉరుకోవాలా అని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రశ్నించారు. ఆళ్లగడ్డ చికెన్ సెంటర్లలో దందాలు నడుపుతున్నామని ఆరోపణలు వస్తున్నాయన్నారు. స్థానిక ఏఎన్‌ఆర్ చికెన్ సెంటర్‌లో వైరస్ సోకిన కోళ్ల మాంసం ప్రజలకు విక్రయిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. జిల్లా అధికారులు ఆ చికెన్ సెంటర్‌లోని కోళ్లను ల్యాబ్‌కు పంపితే బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారించారన్నారు. అలాంటప్పుడు చర్యలు తీసుకోకుండా ఉండాలన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు



సమావేశంలో మాట్లాడుతున్న వలసల రామకృష్ణ

డోన్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కోట్ల కుటుంబంపై విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ మహానాడులో గత ప్రభుత్వం వైఫల్యాలపై చర్చ వచ్చిందన్నారు. ఇందులో భాగంగా డోన్ నియోజకవర్గంలో జరిగిన వైఫల్యాలపై మాట్లాడితే.. వాటికి వైసీపీ నాయకులు సమాధానం చెప్పకుండా చిల్లర విమర్శలకు దిగడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్య గౌడు, డిష్ రఫి, అన్వర్, ఓంప్రకాష్, వలసల బాలుడు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు రుణాలు



శిరివెళ్లలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి

శిరివెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లోని మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శిరివెళ్లలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆళ్లగడ్డ క్లస్టర్‌స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హౌస్‌హోల్డ్ లైవ్లీహుడ్ ప్లాన్, మైక్రో క్రెడిట్ ప్లాన్ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. మైక్రో క్రెడిట్ ప్లాన్, బిజినెస్ ఆక్టివిటీ ఎంటర్‌ప్రూనర్ వివరాలను సమావేశంలో తెలియజేశారు. సమావేశంలో బ్యాంకు లింకేజీ డీపీఎం ఎల్లయ్య, డీపీఎం ఐబీ కృష్ణమూర్తి, శ్రీనిధి ఏజీఎం నాగ ప్రసాద్, ఆళ్లగడ్డ క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ విజయ గోపాల్, మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

'వసుధ' సేవలు అభినందనీయం

- టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ



చెక్కును పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి) : వసుధ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళశాలలోని బీసీ గుర్రెడ్డి ఆడిటోరియంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీసీ ఇందిరమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ద్వార ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వెంకటరామరాజు సేవలు అభినందనీయమన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న 12మందికి రూ. లక్ష చెక్కులను బీసీ ఇందిరమ్మ పంపిణీ చేశారు. సమావేశంలో సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మంజునాథరెడ్డి, ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడు భరతుడు, గణేష్ ఉత్సవకమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, బనగానపల్లె ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీచర్ నాగరాజు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, లాయర్ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డుతో జనసైనికుల్లో ధీమా

శిరివెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో జనసేన పార్టీ ప్రవేశ పెట్టిన సభ్యత్వ నమోదు కార్డుతో జన సైనికుల్లో ధీమా నెలకొందని ఆ పార్టీ శిరివెళ్ల మండల ఇన్‌చార్జి ఇరిగెల ప్రతాప్‌రెడ్డి అన్నారు. శిరివెళ్ల మెట్ట వద్ద జన సైనికులకు సభ్యత్వ నమోదు కార్డులను ఆయన బుధవారం పంపిణీ చేశారు. జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పసుల నరేంద్ర యాదవ్, పెసరాయి చాంద్ బాషా, ఓబుళకొండారెడ్డి, తలారి పెద్ద బాలయ్య, పఠాన్ ఇబ్రహీం, తేజోనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

డోన్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను డోన్ టీడీపీ యువ నాయకులు మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. కొండపేటకు చెందిన మహేంద్ర తండ్రి టీడీపీ నాయకుడు కాశీ విశ్వనాథ్ తమ్ముడు నాగేశ్వరరావు ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లను కోరారు.



శిల్పి హరిప్రసాద్ చెక్కిన అశోకస్తూపాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

జాతి పురోగతికి చిహ్నం అశోక స్తూపం

- ప్రముఖ శిల్పి దురుగడ్డ హరిప్రసాద్‌ఆచారి

ఆళ్లగడ్డ, మే 21(ఆంధ్రజ్యోతి): అశోక స్తూపం ఏర్పాటు మన జాతి పురోగతికి చిహ్నమని ప్రముఖ శిల్పి దురుగడ్డ హరిప్రసాద్‌ఆచారి అన్నారు. బుధవారం ఆళ్లగడ్డలోని శిలాకృతి స్టూడియో ప్రాంగణలో అశోక స్తూపం ప్రాజెక్టు నూతన ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని స్తూపాన్ని ప్రారంభించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ పట్టణంలో ఇంతటి గొప్ప ప్రాజెక్టు ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగన్న, ఆవోపా నాయకులు వెంకటసుబ్బయ్య, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పద్మా, అనసూయ, దర్గడ్డ అనురాధ, కాళిమాత ఆలయ కమిటీ సభ్యురాలు సావిత్రమ్మ, శిలా కృతి స్టూడియో ఇన్‌చార్జి మాధవన్ పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లెలో అపరిశుభ్రత

- సచివాలయం సమీపంలోనే మురుగు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



వీధిలో ప్రవహిస్తున్న మురుగు

కొలిమిగుండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో అపరిశుభ్రత నెలకొంది. పలు చోట్ల వీధుల్లో మురుగు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయానికి అతి సమీపంలో ఎర్రప్పగారి వీధిలో సీసీ రోడ్డుపై మురుగు ప్రవహిస్తూ కంపు కొడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆప్రాంతం దోమలకు నిలయంగా మారింది. దోమల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు రోగాబారిన పడుతున్నారు. సచివాలయం సమీపంలోనే మురుగు ఉన్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైసీపీ నాయకుడి, అనుచరులపై కేసు నమోదు

ఆళ్లగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్సాసీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగిన తెలిపారు. అలాగే అతడి అనుచరులు ఆరుగురిపై కూడా పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఎర్రగుంట్ల నాగప్రసాద్ ఫిర్యాదు మేరకు కిషోర్‌రెడ్డితోపాటు అనుచరులు అంబటి మహేశ్వరరెడ్డి, శివశంకర్ రెడ్డి, మల్లికార్జున, రుద్ర శివనాగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అంబటి చంద్రశేఖర్ రెడ్డి పై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు అయిందన్నారు. ఎమ్మెల్యే చికెన్‌పై రూ. 25లు అదనంగా వసూలు చేయిస్తున్నారని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఉద్రిక్త పరిస్థితులకు కారణమవుతున్నారని ఫిర్యాదు పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధికి నిధులు

చాగలమర్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, పెద్దబోదనం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. మద్దూరు గ్రామంలో రూ.20 లక్షలు, పెద్దబోదనంలో రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. జ్ఞానాపురం రహదారిలో వకంపై దెబ్బతిన్న స్లాబ్ మరమ్మతులు చేసేందుకు రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ప్యాపిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో అధిరులు శ్రీనివాసులు, భారతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

250 టీబీ కేసులు నమోదు



వివరాలు తెలుసుకుంటున్న పవన్‌కుమార్‌రెడ్డి

చాగలమర్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో 250 టీబీ కేసులు ఉన్నాయని క్లస్టర్ టీబీ నివారణ సూపర్‌వైజర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని 4వ వార్డులో టీబీ వ్యాధితో బాధపడుతున్న వారిని పలకరించి వ్యాధి నివారణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో 54 టీబీ కేసులు ఉన్నాయని అన్నారు. టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం మందులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు ఉమాదేవి, ఆశా వర్కర్లు ఉన్నారు.

జీలుగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

కోవెలకుంట్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువు, జీలుగ విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడతూ రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో కేజీ రూ. 61.50 ఎకరాకు పదికేజీల చొప్పున గరిష్ఠంగా ఐదు ఎకరాలకు 50కేజీలు మంజూరు చేస్తుందన్నారు. వరి సాగు చేసే రైతులు తప్పకండా జీలుగ విత్తనాలు కొనుగోలు చేసి పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని ఆయన సూచించారు.

రుద్రవరం : మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో జీలుగలు విత్తనాల కోసం రైతుల పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో సుమతి బుధవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల 16 రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేస్తున్నామన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై కళాకారుల అవగాహన

బేతంచెర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా, ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీ (ఎయిడ్స్)పై అవగాహన కల్పించారు. బుధవారం నారాయణ కళాజాతా బృందం ద్వారా బేతంచెర్లలోని శేషారెడ్డి హాస్పిటల్ దగ్గర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు వెంకటేశ్వర్లు సమక్షంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు, హ్యాండ్స్ ప్రాజెక్టు మేనేజర్ మధు కుమార్, సరస్వతి, విజయలక్ష్మి, శాంతి, సుంకన్న, కాశీం పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

బేతంచెర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణలో గురువారం జరిగే వీర హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని మన ఊరు- మన గుడి సంస్థ సభ్యులు అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీరహనుమాన్ శోభాయాత్ర అమ్మవారి శాల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

అవుకు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గురువారం నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయాల నిర్వాహకులు బుధవారం తెలిపారు. పట్టణంలోని రాజవీధి, కోటవీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం పూజల, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

సంజామల, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోమల సమీపంలోని కోటపాడు బస్టాండు పంచవతి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం గంగాయానం, గోమాత పూజ, మహాగణపతి పూజలను వేదపండితులు నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే వేడుకలకు భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

రుద్రవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లోని నరసాపురం ఠాణా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫారెస్టు ఠాణా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వాహనాలు రాకపోకలను గమనించడం సులభతరమవుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

కల్వటాలలో మోటార్‌సైకిల్ చోరీ

కొలిమిగుండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వటాల గ్రామంలో ఇంటి వద్ద పార్కింగ్ చేసిన మోటార్‌సైకిల్ చోరీకి గురైనట్లు ఎస్ఐ గోపాల్ బుధవారం వెల్లడిం చారు. గ్రామానికి చెందిన వంకదార చంద్రశేఖర్ ఏపీ39 ఎస్‌హెచ్-4289 మోటార్‌సైకిల్ ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.